క్లుప్తంగా

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

కలికిరి: మండలంలోని గుండ్లూరు గ్రామం అద్దవారిపల్లి సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమణదారులు చదును చేసి కంచె ఏర్పాటు చేసినట్లు గ్రామానికి దళితులు తహసీల్దారు పి.విజయకుమారికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఎంతో విలువైన భూమి కావడంతో ఆక్రమణదారులు అక్రమ నిర్మాణాలు చేపట్టడానికి ప్రయత్నం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ ఆస్తిని కాపాడాలన్నారు. సదరు స్థలాన్ని ఆలయ నిర్మాణానికి కేటాయించాలని ఫిర్యాదులో కోరారు.

వైభవంగా విగ్రహ ప్రాణప్రతిష్ట



హోమంలో పాల్గొన్న భక్తులు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని అంకిరెడ్డిపల్లిలో నూతనంగా వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ధర్మకర్త బోర్ వెల్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆలయంలో అభిషేకాలు, హోమాలు, ప్రతిష్ట కార్యక్రమాలతో పాటు భక్తులకు ఉచిత అన్నదాన సౌకర్యం కల్పించారు. పూజా కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ భాగ్యమ్మతో పాటు పార్టీలకతీతంగా ప్రజా ప్రతినిధులు మహమూద్, సయ్యద్‌బాషా, ఖాదర్‌వలి, శివారెడ్డి, కుంచే శ్రీనివాసులు, విశ్వనాథ్‌రెడ్డి, గుప్తా పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయంలో పూజలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని టి.సదుం పంచాయతీ చిన్నపొంగుపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్లారెడ్డిగారి మధూకర్‌రెడ్డి, బయారెడ్డిలు సొంత నిధులతో నూతనంగా గంగమ్మ ఆలయాన్ని నిర్మించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

భక్తుల సౌకర్యార్థం రోడ్డు మరమ్మతులు

రామసముద్రం: మండలంలోని చెంబకూరు గ్రామ సమీపంలోని శ్రీగట్టు వెంకటరమణ స్వామి ఆలయం రోడ్డు గుంతలు పడి అధ్వానంగా ఉండటంతో భక్తుల సౌకర్యార్థం మరమ్మతులు చేపట్టారు. ఆలయానికి మూడు రోడ్ల కూడలి నుంచి సుమారు ఒక కిలోమీటరు పైన మట్టి రోడ్డు నిర్మాణం ఉంది. వర్షం కారణంగా రోడ్డు గుంతలమయంగా మారింది. బ్రహ్మోత్సవాలు సందర్భంగా భక్తులు ఆలయానికి వెళ్ళడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో దిగువపల్లి గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి , మునియప్పలు సొంత నిధులు ఖర్చు చేసి రోడ్డు మరమ్మతులు చేపట్టామని పేర్కొన్నారు.

ఆర్టీసీ పెట్రోల్ బంకులో మరిన్ని సౌకర్యాలు

మదనపల్లె సిటీ: ఆర్టీసీ సంస్థ ఆధ్వర్యంలో నడిచే పెట్రోల్ బంకులో వాహనదారులకు మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. పెట్రోల్ బంకులో క్వాలిటీ, క్వాంటిటికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఆయిల్ ఛేంజ్ మిషన్ త్వరలో పెట్టనున్నట్లు తెలిపారు.దీనికి ఎలాంటి సర్వీసు చార్జీలు వసూలు చేయమన్నారు. దీంతో పాటు వాహనాలకు నైట్రోజన్ ద్వారా గాలి నింపడం జరుగుతుందన్నారు. ఆటోమేటిక్ టెల్లింగ్ మిషన్ కూడా అమలు చేయనున్నట్లు తెలిపారు.

పౌష్టికాహార పక్షోత్సవాలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని రంగసముద్రం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం ఐసీడీఎస్ సీడీపీవో భాగ్యమ్మ ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆహారపు అలవాట్లు, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రతలను క్షుణంగా వివరించారు. ఆమె వెంట సూపర్‌వైజర్ జయరాణితో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

ఘనంగా నల్లగంగమ్మ విగ్రహ ప్రతిష్ట



పీలేరు రూరల్ : స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలోని రజకుల కాలనీలో నూతనంగా నిర్మించిన నల్లగంగమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు నూతన ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. శుక్రవారం తెల్లవారిజామున వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ట, మహాకుంభాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని విశేషాలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు రామయ్య, రమణ, బాల, శ్రీకాంత్, దేవేంద్ర పాల్గొన్నారు.

ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలి

మదనపల్లె ఆర్వో హరిప్రసాద్



మాట్లాడుతున్న ఆర్డీఓ, ఆర్వో హరిప్రసాద్

మదనపల్లె : సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలని మదనపల్లె నియోజక వర్గ ఎన్నికల అధికారి, ఆర్డీఓ హరిప్రసాద్ స్పష్టం చేశారు. శుక్రవారం సబ్ కలెక్టరేట్‌లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుపై రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ... రానున్న ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఎన్నికల బరిలో నిలిచే పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ప్రచారాలు చేసుకోవాలని సూచించారు. గతంలో మాదిరి కాకుండా ఈ దఫా ఎన్నికల నిబంధనలు కఠినంగా ఉన్నాయని, వీటిని అందరూ అనుసరించాలన్నారు. ఎన్నికల ప్రచారంతో పాటు పార్టీ బహిరంగ సమావేశాలు, బైక్‌ర్యాలీలు, ఇళ్లపై జెండాలు కట్టడం వంటి 19 కార్యక్రమాలకు అనుమతులు తీసుకోవాలని, వీటి నిమిత్తం సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి 24 గంటల ముందు అనుమతులు ఇస్తామన్నారు. ఎన్నికల ప్రచార సరళి పర్యవేక్షణకు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు నియమించామన్నారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలో పార్టీ కార్యాలయాలు ఉండాలన్నారు. పిల్లలను ఎన్నికల ప్రచారంలో వినియోగించవద్దన్నారు. రూ.50వేలు దాటి నగదు తీసుకెళ్లేటప్పుడు దానికి సంబంధించి, లెక్కలు సరిగా చెప్పాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను కఠినంగా అమలు చేస్తామని చెప్పారు. తనిఖీ బృందాల పర్యవేక్షణ మొదలైందని, ఫిర్యాదుల కోసం సివిజిల్ యాప్ ఏర్పాటు చేశామని తెలిపారు. మద్యం , నగదు, తదితర వాటి అక్రమరవాణా అడ్డుకట్టకు అంతరాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్ట్‌ల ఏర్పాటు చేశామని, 24 గంటలు ఇవి పనిచేస్తాయన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయా రాజకీయపార్టీలు చేస్తున్న ఖర్చులను వారి ఖాతాకే జమచేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రసాదరెడ్డి, తహసీల్దార్‌లు రమాదేవి, శ్రీనివాసులు, బాలాజీరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఓ కార్యాలయాన్ని పరిశీలించిన ఎస్పీ



పీలేరు ఆర్‌ఓ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణారావు

పీలేరు : పీలేరు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ కృష్ణారావు పరిశీలించారు. సార్వత్రికి ఎన్నికల కోసం స్థానిక తహసీల్దార కార్యాలయంలో ఇదివరకే రిటర్నింగ్ అధికారి కార్యాలయం, కమాండ్ కంట్రోల్ రూం, ఎన్నికల వ్యయ పర్యవేక్షణ కార్యాలయం, ఎంసీసీ గదిని ఏర్పాటు చేశారు. ఆయా విభాగాల్లో పని చేస్తున్న సిబ్బంది, పని చేసే విధానం, ఫిర్యాదుల పట్ల స్పందించే తీరును ఎస్పీ ఆయా సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, పోలీస్ శాఖ తరపున అన్ని వేళలా సహాయ సహకరాలు ఉంటాయని తెలిపారు. పీలేరు నియోజకవర్గ పోలీస్ లైజనింగ్ అధికారులుగా సీఐ సాధిక్ అలీని నియమించామని, ఇకపై ఆర్వో కార్యాలయంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా. తహసీల్దార్ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై అప్రమత్తంగా వ్యవహరించాలి

కలికిరి: పోలీసు సిబ్బంది ఎన్నికల సంఘం ప్రకటించిన నియమావళిపై అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశించారు. కలికిరి పోలీస్ స్టేషన్‌ను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన నియమావళి నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని, ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణాన్ని కల్పించాలన్నారు. అనంతరం మండలంలోని మహల్‌లో గల పోలింగ్ స్టేషన్ తనిఖీ చేసి, సదుపాయాలను పరిశీలించారరు. డీఎస్పీ మహబూబ్‌బాషా, కలికిరి సీఐ ఆర్.మోహన్, సిబ్బంది ఆయన వెంట పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి



ఎన్నికల ప్రచారంలో పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

పీలేరు : ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి నిండు మనస్సుతో ఆశీర్వదించి రాష్ట్రానికి రెండోసారి ముఖ్యమంత్రిని చేయాలని పీలేరు, కేవీపల్లె మండలాల పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని పద్మావతి నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గడిచిన ఐదు సంవత్సరాల్లో వైఎస్సార్‌సీపీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం ఆర్థికంగా లబ్ధి పొందిందని తెలిపారు. సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డిని మరోసారి గెలిపించి, హ్యాట్రిక్ విజయాన్ని కానుకగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ జీనత్‌షఫీ, వైస్ ఎంపీపీ ఎస్.వి. చలపతి, నాయకులు కడప గిరిధర్‌రెడ్డి, శ్రీరామ్ సుధాకర్, హబీబ్ బాషా, హుమయూన్, సచిన్, మహితా ఆనంద్, నాగరాజమ్మ, చక్రధర్, చైతన్యరెడ్డి, విజయశేఖర్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఉదయ్, షాకీర్, రాజ్యలక్ష్మీ, సపూరా, రాజేశ్వరి, కాలేషా, దావూద్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీసెల్ జాయింట్ సెక్రటరీగా సబూరాబేగం



పీలేరు : వైఎస్సార్ సీపీ జిల్లా మైనారిటీసెల్ మహిళా జాయింట్ సెక్రటరీగా సబూరాబేగంను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పీలేరు పట్టణానికి చెందిన సబూరాబేగం పార్టీ అభివృద్ధికి విశేష సేవలందించారు. ఆమె సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం ఆమెకు మైనారిటీ సెల్ మహిళా జాయింట్ సెక్రటరీగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తను పదవి ఇవ్వడం పట్ల ఎంపీ మిథున్‌రెడ్డికి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కేవీపల్లె : 40 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని ఓ నిందితున్ని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రహీముల్లా తెలిపారు. వివరాలిలా వున్నాయి. మండలంలోని గర్నిమిట్ట కస్పాకు చెందిన జ్యోతికుమార్ అక్రమంగా మద్యం బాటిళ్లు కలిగి ఉండగా శుక్రవారం పోలీసులు దాడి చేసి అరెస్ట్ చేశారు. 180 మిల్లీలీటర్ల బాటిళ్లు 40 స్వాధీనం చేసుకుని నిందితున్ని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జలంతోనే జీవకోటికి మనుగడ



జల దినోత్సవంలో మాట్లాడుతున్న రామనాధన్

కురబలకోట: సమస్త జీవరాశికి జలంతోనే మనుగడయని అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాధన్ అన్నారు. శుక్రవారం జల దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆహారం లేకున్నా కొన్నాళ్లు బతకవచ్చు కాని, నీళ్ల లేక పోతే ఎక్కువ రోజులు జీవించలేమన్నారు. నీటికి అంత ప్రాధాన్యత ఉందన్నారు. ప్రస్తుతం పక్కనున్న బెంగళూరులో నీటి సమస్య ఎక్కువగా ఉందన్నారు. ఇందుకు కారణం రుతుపవనాల ప్రభావం తగ్గడం, భూగర్భ జలాలు ఎండిపోవడంతో టెక్ హబ్‌గా ఎంత పేరున్నా బెంగళూరులో నీటి సమస్య తాండవిస్తోందన్నారు. ఇలాంటి పరిస్థితి రాకుండా ముందు జాగ్రత్త వహించాలన్నారు. వృధా నీటిని అరికట్టాలన్నారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకిపోయేలా చూడాలన్నారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



ప్రత్యేక అలంకారంలో శ్రీచంద్రశేఖరస్వామి

రామసముద్రం: రామసముద్రం మండల కేంద్రంలోని వెలసిన శ్రీపార్వతిసమేత శ్రీ చంద్రశేఖర్‌స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం అంకురార్పణతో ప్రారంభమైయ్యాయి. స్వామివారికి ఉదయం అభిషేకాలు, రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు బాలస్వామి మాట్లాడుతూ ఈ చంద్రశేఖర స్వామిఆలయం ఎంతో పవిత్రతో సంచరించుకుందని తెలిపారు. ఆలయంలో శివలింగాన్ని దర్శించుకున్న వాళ్లు వెయ్యి శివాలయాలు తిరిగినంత పుణ్యం దక్కుంతుందని తెలిపారు.

వైఎస్సార్‌సీపీతోనే అన్ని వర్గాల సమగ్రాభివృద్ధి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్

కలికిరి: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీతో అన్ని వర్గాల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్ అన్నారు. మండల కేంద్రంలోని ఏఎస్ఆర్ కాలని, టీ.బీ.రోడ్డు ప్రాంతాల్లో ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీతో రాష్ట్రంలో ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందారని, గత ఎన్నికలలో ఇచ్చిన హామీలతో పాటు అనేక కొత్త సంక్షేమ పథకాలతో ప్రజలకు నేరుగా మేలు చేసిన ఘనత సీఎం జగన్ మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. కుల, మత, రాజకీయాలతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటికి ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. ఇప్పుడున్న సంక్షేమ పథకాలతో పాటు మరిన్ని సంక్షేమ పథకాలు అర్హులకు అందాలంటే మళ్లీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఇంటింటా వివరించి, కరపత్రాలను అందజేశారు. నిత్యం ప్రజాసేవకే అంకితమైన రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలను ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ సతీష్ రెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్టీడి హరి, ఆర్.మధుసూదన్‌రెడ్డి, ఎంఐ హనీఫ్, సర్పంచ్‌లు వెంకటరెడ్డి, తస్లీమా రియజ్, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతమైన లక్ష్యాలు నిర్దేశించుకోవాలి



మాట్లాడుతున్న డీవైఈవో శ్రీరామ్ పురుషోత్తం

కేవీపల్లె : విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలు నిర్దేశించుకోవాలని మదనపల్లె డివిజన్ డీవైఈవో శ్రీరామ్ పురుషోత్తం అన్నారు. శుక్రవారం మండలంలోని వగళ్ల కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. తొమ్మిదవ తరగతి విద్యార్థినులతో ముఖాముఖి సంభాషణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆంగ్లంపై పట్టు సాధించాలని కోరారు. విద్యార్థులు లక్ష్యసాధన కోసం ఐదు మార్గాలైన క్రమశిక్షణ, కోరిక, సంకల్పం, అంకితభావం, ఆరోగ్యం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. శ్రావణి, పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రక్తహీనత నుంచి రక్షించడానికి ఐరన్ సిరప్



చిన్నారికి ఐరన్‌పోలిక్‌యాసిడ్ సిరప్‌ను ఇస్తున్న వైద్య సిబ్బంది

కలకడ : చిన్నపిల్లలో రక్తహీనత రాకుండా రక్షించడానికి ప్రభుత్వం ఉచితంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు ఐరన్‌పోలిక్ యాసిడ్ సిరప్‌ను అందజేసిందని డాక్టర్ కిషోర్‌కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ నుంచి అన్ని ఆరోగ్య ఉపకేంద్రాలకు 60ఎంఎల్ ఐరన్ సిరప్ టానిక్‌లు 50 చొప్పున సిబ్బందికి అందజేశారు. ప్రతి బుధవారం, శనివారం చిన్నారులకు ఆశావర్కర్లు, ఆరోగ్యకార్యకర్తలు సిరప్ అందజేస్తారని గుర్తుచేశారు. ప్రతి బిడ్డకు కేవలం 01 ఎంఎల్ మాత్రం పిల్లర్ ద్వారా వేయాలన్నారు. 6నెలల నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలు కలిగిన తల్లిదండ్రులు ఆరోగ్య ఉపకేంద్రాలకు వెళ్లి పిల్లల పేర్లు నమోదు చేసుకుని ఉచితంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ ఈఓ జయరామయ్య, స్టాప్‌నర్స్ భారతమ్మ, పీహెచ్ఎన్ సుబ్బరత్న, సూపర్‌వైజర్ రెడ్డెమ్మ, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న జేఎన్టీయూ విద్యార్థులు

కలికిరి: ఓటు కలిగిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దారు పి.విజయకుమారి అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం నుంచి గాంధీ కూడలి వరకు జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో కలిసి ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కును వినియోగించుకుని మెరుగైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శేష వాహనంపై గట్టువెంకటరమణుడు



రామసముద్రం: మండలంలోని చెంబకూరులో వెలసిన శ్రీగట్టువెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి శేషవాహనంపై స్వామివారు ఊరేగారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారికి పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: పలు పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్నారు. శుక్రవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి దండువారిపల్లెలో పర్యటించారు. టీడీపీ మండల మాజీ కన్వీనర్ అమరనాథరెడ్డి, రేణుమాకులపల్లె మాజీ సర్పంచు సాంబశివారెడ్డి, కోటకొండ పంచాయితీ మండ్యంవారిపల్లె మల్లయ్యకొండ మాజీ చైర్మన్ శ్రీనివాసులు వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారిని కండువాలు కప్పి ఆహ్వానించారు. సీయం జగన్‌మోహన్‌రెడ్డి అమలు పరుస్తున్న సంక్షేమ థకాలు, ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు చినరెడ్డి, మండల కన్వీనర్ చౌడేశ్వర్, నాయకులు లక్ష్మీరెడ్డి, నరేంద్రరెడ్డి, కరీముల్లా, నరసింహారెడ్డి, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక సింపోజియంతో మరింత ప్రతిభ



మాట్లాడుతున్న కాలేజీ డైరెక్టర్ రామలింగారెడ్డి

మదనపల్లె సిటీ: టెక్నికల్ సింపోజియం వల్ల విద్యార్థుల్లో మరింత ప్రతిభ మెరుగుపడుతుందని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి అన్నారు. శుక్రవారం పుంగనూరు రోడ్డులోని ఇంజినిరింగ్ కాలేజీలో జాతీయ స్థాయి సింపోజియం ఘనంగా నిర్వహించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల పెయింటింగ్‌లను ప్రదర్శించారు. ఈఈఈ, ఈసీఈ, హెచ్ అండ్ ఎస్ ఇంజనీరింగ్ విద్యార్థులచే పేపర్ ప్రజెంటేషన్ నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల టెక్నికల్, నాన్ టెక్నికల్ ప్రాజెక్టులను తయారు చేశారు. సింపోజియం వల్ల భవిష్యత్తులో మరింత ముందుకు పోవడానికి తోడ్పడుతుందన్నారు. సెమి కండక్టర్స్ వాటి ప్రత్యేకత వాటి వల్ల కలిగే ఉపయోగాలను ట్రాన్సిస్టర్ మోడ్రన్ ప్రొఫెసర్ల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సతీష్‌బాబు,ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ ఎం.జగదీష్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని ఆదరించండి

ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్



కారు, టాక్సీ డ్రైవర్లతో ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్

మదనపల్లె : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీని ఆదరించి, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పట్టణంలోని టౌన్‌బ్యాంక్ సర్కిల్ సమీపంలోని కార్‌స్టాండ్‌లో టాక్సీడ్రైవర్లతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నిసార్ అహ్మద్ మాట్లాడుతూ..... ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో కుల,మత,పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా లబ్ధిదారుల ఇంటివద్దకే ప్రభుత్వ పథకాలు అందించడం జగనన్న ప్రభుత్వంలోనే జరిగిందన్నారు. పేదపిల్లలకు ఉన్నతమైన విద్య అందించేందుకు ప్రభుత్వపాఠశాలల రూపురేఖలు నాడు-నేడు పథకంతో మార్చడంతో పాటుగా, ఇంగ్లీషుమీడియంను ప్రవేశపెట్టి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేశారన్నారు. మహిళా సాధికారతలో భాగంగా వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నావడ్డీ తదితర పథకాలతో మహిళల ఆర్థికాభివృద్ధికి బాసటగా నిలిచారన్నారు. ఆటోడ్రైవర్లకు వాహనసేస్తం కింద ఏడాదికి రూ.10వేలు అందించి, అండగా నిలిచారన్నారు. జగనన్న పాలనలో అన్నివర్గాల ప్రజలకు సమన్యాయం జరిగిందని, అందరూ సంతోషంగా ఉన్నారన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రతిపక్షాలు అబద్ధపుహామీలు, మాయమాటలతో ప్రజలను మోసగించేందుకు వస్తున్నాయని, మంచి చేసిన జగనన్నకు ప్రజలంతా అండగా నిలిచి ప్రజాప్రభుత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి ఎంపీ మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థినైన తనను గెలిపించాలని కోరారు.

ప్రజాశీర్వాదమే జగనన్న బలం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్వేత

వాల్మీకిపురం: ప్రజాశీర్వాదమే జగనన్న బలమని, అందుకే పార్టీ ఆవిర్భావం నుంచి ఏ పార్టీతో పొత్తు లేకుండా ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని సర్పంచ్ శ్వేత అన్నారు. శుక్రవారం మండలంలోని విఠలంలో మేము సిద్ధం మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణి చేసి, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా శ్వేత మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సంక్షేమం అంటే ఎంటో జగనన్న చూసి, చూపి నిరూపించాడని, తమ ఓట్లు జగనన్నకేనని ప్రజలు ముక్తకంఠంతో ప్రకటించారు. ప్రతి కుటుంబానికి రూ.లక్షల్లో సంక్షేమం చేరాలంటే జగనన్నతోనే సాధ్యమన్నారు. ఈ ఎన్నికలు పెత్తందార్లు, పేదలకు జరుగుతున్న యుద్ధమని, అదమరచకుండా ఫ్యాను గుర్తుకే ఓట్లు వేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకొందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సురేష్ రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటస్వామి, నాగార్జున, సిద్ధప్పరెడ్డి, రవి, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో వాల్మీకి సంఘం అభ్యర్థుల పోటీ



వాల్మీకి సంఘం నాయకులు

కురబలకోట: వాల్మీకుల సమస్యలను ప్రజల దృష్టికి తీసుకెళ్లడానికి ఈ ఎన్నికల్లో వాల్మీకి సంఘం తరపున ఇండిపెండెంట్ అభ్యర్థులను బరిలోకి దింపుతున్నట్లు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం అంగళ్లు మల్లయ్య కొండపై జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇన్నేళ్లు వివిధ పార్టీలు వాల్మీకుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చాయన్నారు. ఓట్ల కోసం వాడుకుని చివరకు మోసం చేశారన్నారు. ఎస్టీ సాధన కోసం ఎన్ని ఉద్యమాలు చేసినా నెరవేరడం లేదన్నారు. తమ సమస్యలు ప్రజల దృష్టిలో పడటానికి రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల్లో అభ్యర్థులను పోటీ చేయిస్తున్నట్లు తెలిపారు. నాగతాతగారి నరసింహులు, నర్సరీ మేష శ్రీనివాసులు, వెంకటరమణ, నరసింహులు, రాధాకృష్ణ, గందోడి వేమన్న, సుధాకర్, నారాయణ, మనోహర్, శ్రీరాములు, జయసింహ, మంజునాథ, నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.